క్లుప్తంగా

వారపు సంతలో వైద్య శిబిరం



రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి నాగప్రత్యూష

అడ్డతీగల: ఎల్లవరం పీహెచ్‌సీ వైద్యాధికారి నాగప్రత్యూష ఆధ్వర్యంలో మంగళవారం వారపుసంతలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వంద మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనారోగ్య సూచనలు కనిపిస్తే వెంటనే దగ్గరలోని ఆస్పత్రికి వెళ్లి వైద్యం చేయించుకోవాలన్నారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గురుకులంలో ప్రవేశాలకు 25 వరకు గడువు

అడ్డతీగల: గురుకుల పాఠశాలలో ఐదో తరగతి ప్రవేశాలకు ఈ నెల 25వ తేదీ వరకు గడువు ఉందని ప్రిన్సిపాల్ హరినాథ్‌బాబు తెలిపారు. ప్రస్తుతం నాల్గో తరగతి చదువుతున్న విద్యార్థులు ఆన్‌లైన్లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. గురుకుల పాఠశాలలోనూ లేదా ఇంటర్నెట్ సెంటర్లలో దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఏప్రిల్ 6న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారన్నారు.

47 మందికి వైద్య సేవలు

హుకుంపేట: మండలంలోని ఉర్రడ బొడ్డాపుట్టులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం విస్తరణాధికారి కోడా మహేష్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 47 మందికి వైద్య సేవలందించారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ప్రియాంక, భానుప్రసాద్, భాస్కర్, శ్రీనుబాబు, వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

గంగవరం: వాహనాదారులు కచ్చితంగా వాహనాలకు సంబంధించి అన్ని రికార్డులు సక్రమంగా ఉంచుకోవాలని స్థానిక అడిషినల్ ఎస్సై సి.రాంబాబు తెలిపారు. మంగళవారం సాయంత్రం స్థానిక పోలీసు స్టేషన్, వై.జంక్షన్, గంగవరం–అడ్డతీగల రూట్‌లో వాహనాలను విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులు మద్యం సేవించి నడిపినా చర్యలు తీసుకుంటామన్నారు. హెచ్‌సీ ఎం.రాంబాబు, పీసీ శ్రీను, ఏఆర్ పోలీసులు నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయ ఆలయ వార్షికోత్సవం



పూజా కార్యక్రమాలు చేస్తున్న దృశ్యం

సీలేరు: గూడెం కొత్తవీధి మండలం సీలేరులో ఆంజనేయ స్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో మంగళవారం వేకువజామున నుంచి మండప ఆవాహనం నిర్వహించారు. అనంతరం 108 ఘటాలతో సుగంధ ద్రవ్యాలతో స్వామివారికి పంచామృతాభిషేకాలు, నాగవల్లీసహిత వడిమాల పూజ కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం 4 గంటల నుంచి చండీహోమం నిర్వహించారు. బుధవారం ఉదయం 8 గంటల నుంచి లక్ష కుంకుమార్చన, మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఉచిత కుట్టు శిక్షణకు దరఖాస్తులు

రంపచోడవరం: మండలంలో 19 పంచాయతీల్లో బీసీ, ఈబీసీ, కమ్మ, రెడ్డి, క్షత్రియ, బ్రాహ్మణ, కాపు కులాల మహిళలకు ఏపీ ప్రభుత్వం ద్వారా ఉచితంగా కుట్టు శిక్షణ ఇచ్చి, కుట్టు మిషన్లు ఇవ్వనున్నట్టు ఎంపీడీవో సుండం శ్రీనివాసుదొర తెలిపారు. మండలంలో స్థిర నివాసంతోపాటు ఆధార్, కులధ్రువీకరణ పత్రం కలిగి, 20 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సు మహిళలు అర్హులన్నారు. వార్షికాదాయం రూ.15 వేలు నుంచి రూ.20 వేలు మించరాదన్నారు. అభ్యర్థులు ఈ నెల 22 వరకు దరఖాస్తులను సచివాలయాల్లో అందజేయాలని తెలిపారు.

జెడ్పీ అతిథి గృహానికి మోక్షం

నూతన భవనం నిర్మాణానికి రూ. 20లక్షల మంజూరు

త్వరలో ప్రారంభం కానున్న పనులు..



శిథిలావస్థలో ఉన్న ముంచంగిపుట్టు జెడ్పీ అతిథి గృహం



పూర్తిగా పాడైన మరుగుదొడ్లు..

ముంచంగిపుట్టు: జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర చొరవతో ఎట్టకేలకు జెడ్పీ అతిథి గృహానికి మోక్షం కలిగింది. రూ.20 లక్షలతో నూతన భవనాలు నిర్మించనున్నారు. ఎన్నో ఏళ్లుగా ఇది శిథిలావస్థలో ఉండడంతో వివిధ పనులపై వచ్చే అతిథులు ఆశ్రమించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతూ ఉండేవారు. 1972లో ముంచంగిపుట్టులో నిర్మించిన జెడ్పీ అతిథి గృహం కొన్నేళ్ల క్రితం మరమ్మతులు చేసినా, కొన్ని రోజులకే పాడై భవనాల పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. భవనాలు పూర్తిగా శిథిలమై ఎప్పుడు ఏ గోడ కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. గోడలు బీటలు వారాయి. తలుపులు, కిటికీలు పూర్తిగా చెదలు పట్టాయి. వర్షాలకు పైకప్పు శ్లాబు కారిపోయేది. మరుగుదొడ్లు పాడై నిరుపయోగంగా మారాయి. ప్రహరీ పూర్తిగా పాడైపోయింది. ఈ విషయమై గతంలో పలుమార్లు మండల పరిషత్ అధికారులు సర్వే చేసి నివేదికను ఉన్నతాధికారులకు పంపించారు. మండల సర్వసభ్య సమావేశాల్లో సైతం సభ్యులు అనేకసార్లు తీర్మానాలు చేశారు. సర్వేలు, తీర్మానాల వల్ల ప్రయోజనం మాత్రం లేకుండా పోయింది. 23 పంచాయతీలకు చెందిన 374 గ్రామాల ప్రజలకు ఉపయోగపడే జెడ్పీ అతిథి గృహం కూల్చివేసి, కొత్త భవనం నిర్మించాలని మండల వాసులు కోరుతూ వచ్చారు. ఎట్టకేలకు నిధులు మంజూరయ్యాయి.

జిల్లాలో జెడ్పీ అతిథి గృహాలను మెరుగుపరుస్తాం



ముంచంగిపుట్టు జెడ్పీ అతిథి గృహం పూర్తిగా శిథిలమైంది. భవనాల పరిస్థితి అత్యంత ఘోరంగా ఉంది. ఎన్నోయేళ్ల నుంచి జెడ్పీ అతిథి గృహం ఇలా ఉండడం చాలా దారుణం. దీంతో దీన్ని మెరుగుపరచాలని నిర్ణయించుకున్నాను. జెడ్పీ నిధులు నుంచి రూ.20 లక్షలు కేటాయించాను. త్వరలోనే పనులు ప్రారంభిస్తాం. జిల్లాలో జెడ్పీ అతిథి గృహాలకు నిధులు మంజూరు చేసి మెరుగుపరిచేందుకు కృషి చేస్తాను. ఇప్పటికే కొన్ని భవనాలకు నిధులు మంజూరు చేసి బాగు చేయించాం.

– జల్లిపల్లి సుభద్ర, ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్



జెడ్పీ అతిథి గృహంలో పాడైన గోడలు..



పాడైన కిటికీలు..

ఉద్యాన పంటలతో ఆర్థికాభివృద్ధి

– ఎంపీపీ పల్లాల

గంగవరం: గిరిజన రైతులు మామిడి, జీడి మామిడి వంటి పండ్లతోటలు, ఉద్యానవన పంటలు ద్వారా ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి తెలిపారు. హార్టికల్చర్ ఆఫీసర్ (పీహెచ్‌వో) చిట్టిబాబు ఆధ్వర్యంలో స్థానిక గ్రామ సచివాలయం ఆవరణలో గిరిజన రైతులకు 90 శాతం సబ్సిడీపై మంజూరైన స్ప్రేయర్లను వైస్ ఎంపీపీ గంగాదేవి, సర్పంచ్ కలుముల అక్కమ్మలతో కలిసి ఆయన పంపిణీ చేశారు. ఎంపీఈవో పి. స్వర్ణలత మాట్లాడుతూ 20 వేల రూపాయలు విలువగల స్ప్రేయర్‌ను ఐటీడీఏ పీవో సహకారంతో గిరిజన రైతులకు రూ.1,734కే అందిస్తున్నామన్నారు. మండలంలోని ఎనిమిది గ్రామ పంచాయతీలకు చెందిన 50 మంది గిరిజన జీడిమామిడి రైతులకు సబ్సిడీ స్ప్రేయర్లు మంజూరు చేసినట్లు వివరించారు. మాజీ ఎంపీటీసీ కె. బుల్లియమ్మ, ఉప సర్పంచ్ పరదా వెంకటేశ్వరరావు, సచివాలయ పట్టు పరిశ్రమ సహాయకురాలు రెహనా పాల్గొన్నారు.



గిరిజన రైతులకు స్ప్రేయర్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ కృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ గంగాదేవి

పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాల ఏర్పాటు



బాలుర ఆశ్రమ పాఠశాలలో అమర్చిన సీసీ కెమెరా

సాక్షి ఎఫెక్ట్..

దుంబ్రిగుడ: మండలంలో అసౌకర్యాల నడుమ పరీక్షలు అనే శీర్షికతో మంగళవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు ప్రభుత్వ బాలుర ఆశ్రమ పాఠశాల కేంద్రంలోని ఏడు గదులలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రస్తుతం సీసీ కెమెరాలు అమర్చకపోయినా, తరగతి గదుల్లో చెత్తా చెదారాలను తొలగించి శుభ్రం చేయించారు. ఫ్యాన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని హెచ్‌ఎం కృష్ణారావు తెలిపారు.

ఖాళీ బిందెలతో తండా వాసుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న తండా వాసులు

ఎటపాక: మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ బూరుగువాయి తండాలో నీటి ఎద్దడి తీవ్రంగా ఉంది. ఈ సమస్య పరిష్కరించాలని కోరుతూ గ్రామస్తులు ఖాళీ బిందెలతో రహదారిపై మంగళవారం నిరసన తెలిపారు. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా గ్రామానికి వచ్చే తాగునీటి పైపులు తొలగించారని, అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఏడాదిగా నీటి ఎద్దడి ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.
వేసవికి ముందే బోర్లు అడుగంటిపోయాయని, దూర ప్రాంతాలకు వెళ్లి తాగునీరు తెచ్చుకుంటున్నామని వాపోయారు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పరిష్కారం చూపటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సత్వరమే సమస్యకు పరిష్కారం చూపకపోతే ఐటీడీఏ ఎదుట ఆందోళన చేస్తామన్నారు.

రాయితీపై వ్యవసాయ పనిముట్లు

మారేడుమిల్లి: రైతులకు రాయితీపై ప్రభుత్వం వ్యవసాయ పనిముట్లు అందించడానికి నిర్ణయించిందని మండల వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాయితీపై వ్యవసాయ పనిముట్లు కావల్సిన వారు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 8331056625 సంప్రదించాలని కోరారు.

ఎట్టకేలకు రాకాసిరాయి కల్వర్టుపై సీసీ రోడ్డు

3 రోజులపాటు కరిముఖిపుట్టు నుంచి కుమడ రాకపోకలు నిలుపుదల

ముంచంగిపుట్టు: మండలంలో కరిముఖిపుట్టు పంచాయతీ రాకాసిరాయి గ్రామ సమీపంలోని కల్వర్టుపై అస్తవ్యస్తంగా ఉన్న రహదారికి మోక్షం కలిగింది. కల్వర్టును నిర్మించిన కాంట్రాక్టర్ కొన్ని నెలలుగా చిప్స్ రాళ్లను పోసి వదిలేయడంతో అటుగా రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతూ ఉండేవారు. కొంతమంది ప్రమాదాల బారిన సైతం పడ్డారు. దీంతో సర్పంచ్ పూల్‌మొత్తి ఇంజినీరింగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఇంజినీరింగ్ అసిస్టెంట్ సాయికుమార్ పర్యవేక్షణలో మంగళవారం కాంట్రాక్టర్‌తో కల్వర్టుపై సీసీరోడ్డు వేయించే పనులు మొదలు పెట్టారు. సాయంత్రం కల్లా పనులు పూర్తి చేశారు. నూతనంగా సీసీరోడ్డు వేయడంతో రోడ్డు పాడవ్వకుండా మూడు రోజులపాటు కరిముఖిపుట్టు నుంచి కుమడ వెళ్లే వాహన రాకపోకలు నిలుపుదల చేస్తున్నామని కరిముఖిపుట్టు సర్పంచ్ జి.పుల్‌మొత్తి, వైఎస్సార్‌సీపీ మండల నేత అర్జున్ తెలిపారు. అత్యవసర పరిస్థితిలో కుంజభంగి నుంచి బంగారుమెట్ట మీదగా కుమడ, రూడకోట పంచాయతీలకు రాకపోకలు చేయాలని వాహనదారులను కోరారు.



రాకాసిరాయి గ్రామం వద్ద కల్వర్టుపై సీసీ రోడ్డు పనులు

21న మెగా వాలీబాల్ టోర్నమెంటు



సీఐ వరప్రసాద్

గూడెంకొత్తవీధి: పెద అగ్రహారంలో మెగా వాలీబాల్ టోర్నమెంటుతోపాటు, ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఈనెల 21న నిర్వహిస్తున్నట్టు సీఐ వరప్రసాద్ మంగళవారం తెలిపారు. గిరిజన యువతను ప్రోత్సహించేందుకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో టోర్నమెంటు నిర్వహిస్తున్నామన్నారు. క్రీడాకారులు ముందుగా తమ జట్ల వివరాలను పోలీస్ స్టేషన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. పోటీల్లో పాల్గొనే ప్రతి టీంకు వాలీబాల్, నెట్‌లను ఇస్తామన్నారు. విజేతలకు నగదు బహుమతితో పాటు ట్రోఫీలను అందిస్తామన్నారు. గిరిజన గ్రామాల్లో వైద్య సేవలను అందించేందుకు ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తామన్నారు.

సీలేరు పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాల ఏర్పాటు

సీలేరు: పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించి ఎటువంటి మాస్ కాపీయింగ్‌కు పాల్పడకుండా ఉండేందుకు విద్యా శాఖాధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా మంగళవారం సీలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 8 సీసీ కెమెరాలను అమర్చినట్లు అధికారులు తెలిపారు.

రమేష్‌కు ఘన నివాళి



మాట్లాడుతున్న నాయకులు

రంపచోడవరం: సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు, అజ్ఞాత దళ కమాండర్ రమేష్ అన్న ఆరో వర్ధంతి సభను రాకోట గ్రామంలో నిర్వహించారు. జిల్లా కమిటీ, నాయకుడు బి. బొజ్జిరెడ్డి ఆధ్వర్యంలో రమేష్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ నాయకుడు దుర్గాప్రసాద్ మాట్లాడుతూ వరంగల్ పుట్టి పార్టీ పిలుపులో భాగంగా ఏజెన్సీలో 45 సంవత్సరాల పాటు గిరిజనుల కోసం అజ్ఞాత దళ కమాండర్‌గా పనిచేసి పార్టీ రాష్ట్ర నాయకుడిగా ఎదిగారని కొనియాడారు.

అనధికార మోటార్ల తొలగింపు

మాడుగుల రూరల్: పోతనపూడి పంచాయతీ శివారు గ్రామాల్లో డీజే మోటార్ల ద్వారా మంచినీటిని ఇళ్లపై ట్యాంకులకు సరఫరా చేస్తున్న వారిపై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీడీవో కొంకి అప్పారావు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ నాగమల్లేశ్వరి మంగళవారం కొండయ్యపాలెం, పెంటయ్యపాలెం గ్రామాల్లో మంచినీటి ట్యాంకులు పరిశీలించారు. అనధికార మోటార్లను వెంటనే తొలగించాలని, లేదంటే కేసులు పెడతామని హెచ్చరించారు. డీజే మోటార్ల వల్ల ప్రజలకు పూర్తి స్థాయిలో తాగునీరు అందడం లేదని ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు తనిఖీలు చేపట్టామన్నారు. ఎంపీడీవో వెంట సచివాలయ సిబ్బందితో పాటు గ్రామపెద్దలు కోరుకొండ సాంబమూర్తి, పడాల దేముడు, బంటు సోమునాయుడు, గుడివాడ సూరిబాబు పాల్గొన్నారు.

నిర్వాసితులు ఐక్యంగా ఉద్యమిస్తే న్యాయం



మాట్లాడుతున్న సర్పంచ్ పులి సంతోష్ కుమార్

వీఆర్‌పురం: ప్రియారటీ గ్రామాల దరఖాస్తు స్వీకరణ హర్షణీయమని సీపీఎం జిల్లా నాయకుడు సున్నం రాజులు, సర్పంచ్ పులి సంతోష్ కుమార్ తెలిపారు. ఈ నెల 11న వీఆర్‌పురంలో జరిగిన అఖిలపక్ష సమావేశానికి స్పందించిన అధికారులు ఇక్కడ తహసీల్దారు కార్యాలయం వద్ద చింతూరు ఐటీడీఏ పీవో సదస్సు ఏర్పాటు చేశారన్నారు. పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కారం కోసం హడావుడి సభలు కాకుండా పూర్తిస్థాయిలో ప్రజలకు న్యాయం చేయాలన్నారు. గ్రామ సభలు నిర్వహించి సమస్యలను పరిష్కరించాలన్నారు. నిర్వాసితులందరూ ఐక్యంగా ఉద్యమిస్తే తప్ప పూర్తి న్యాయం జరగదన్నారు. నిర్వాసిత గ్రామాల పునరావాస కాలనీలు అన్ని సత్వరమే పూర్తి చేయాలన్నారు. ఇళ్లు, రోడ్లు, డ్రైనేజీలు, మంచినీటి సౌకర్యం కల్పించాలని కోరారు. డి. ఫారం పట్టా భూములకు కొండపోడు భూములకు పరిహారం ఇప్పించాలన్నారు. 18 ఏళ్ల నిండిన యువతకు పరిహారం, పునరావాసం కోసం పునరాలోచన చేయాలన్నారు. నాయకులు పంకు సత్తిబాబు, పోడియం శ్రీరామమూర్తి, కదల కొండయ్య రెడ్డి, సీరపు తాతబాబు, కుంజా కన్నయ్య, ఖాదర్ సుబ్బారావు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ హామీలు అమలుకు డిమాండ్



వర్కుగుమ్మి గ్రామ గిరిజనులతో మాట్లాడుతున్న సీపీఎం నేతలు

ముంచంగిపుట్టు: కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలు అమలు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి కె.త్రినాథ్ డిమాండ్ చేశారు. మండలంలో కించాయిపుట్టు పంచాయతీ వర్కుగుమ్మి గ్రామంలో మంగళవారం సీపీఎం నేతలు ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీసీ రోడ్లు, పింఛన్లు, రేషన్ కార్డులు వంటి సమస్యలను గిరిజనులు వారి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి మాట్లాడుతూ కొత్త రేషన్ కార్డులు, పింఛన్లు మంజూరు కావడం లేదని, అర్హులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ఉపాధి కూలీలకు 250 పని దినాలు, రోజు కూలీ రూ.600 చెల్లించాలని, పెండింగ్ ఉన్న పీఎం జన్‌మన్ గృహాల బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ నేత ఎం ఎంశ్రీను పాల్గొన్నారు.

నూతన ఎంపీడీవోకు ఘన సన్మానం



ఎంపీడీవో డేవిడ్‌రాజ్‌కు శాలువా కప్పి సన్మానిస్తున్న సర్పంచ్‌లు

జి.మాడుగుల: నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంపీడీవో డేవిడ్‌రాజ్‌ను మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు సురభంగి రామకృష్ణ, సర్పంచ్‌లు మంగళవారం ఇక్కడ కార్యాలయంలో శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీడీవోకు మండలంలో 17 పంచాయతీల్లో నెలకొన్న ప్రజా సమస్యలు, ఇబ్బందులు గురించి వివరించారు. వాటిపై దృష్టి సారించి పరిష్కరించాలని కోరారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించటానికి కృషి చేస్తానని నూతన ఎంపీడీవో హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కిముడు రాంబాబు, సూరిబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు పెదబాలన్న, వెంకటేష్, గంగరాజు తదితరలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై విమర్శలు చేస్తే సహించేది లేదు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

జి.మాడుగుల: వైఎస్సార్‌సీపీ ప్రతిష్ట రోజు రోజుకూ పెంచుతూ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుతూ వస్తున్న పాడేరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజుపై చింతపల్లి మండల నాయకుడు మోరి రవి విమర్శలు చేయటం తగదని పార్టీ మండలాధ్యక్షుడు సుర్మని మత్స్యకొండంనాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి వంజరి సీతారాంనాయుడు, ఆర్గనైజింగ్ జిల్లా కార్యదర్శి శిర్మ పండన్న, సర్పంచ్ కిముడు రాంబాబు తెలిపారు. స్థానిక విలేకరులతో మంగళవారం వారు మాట్లాడుతూ గత ఎన్నికల్లో విశ్వేశ్వరరాజు విజయం కోసం ఎవరు కష్టపడి పనిచేశారో, ఎవరు చేయలేదో అధిష్టానానికి తెలుసునని అన్నారు. వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల పాలనలో మండలాధ్యక్షుడిగా పదవి అనుభవించి, నేడు అధికారం లేకపోవటంతో వేరే పార్టీ నాయకులతో సంబంధాలు పెట్టుకొని సొంత పార్టీపైనే విమర్శలు చేయటం సరికాదన్నారు. స్థానిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని పార్టీ బలోపేతానికి నియోజకవర్గంలో పార్టీ మండల అధ్యక్షులను మార్పులు, చేర్పులు చేశారన్నారు. దాంతో పార్టీ పదవి పోయిందని బాధతో బహిరంగ విమర్శలు చేయటం సిగ్గుచేటన్నారు. రవి వ్యాఖ్యలపై పార్టీ క్రమశిక్షణా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు చిట్టిబాబు, వెంకటరమణ, కొండబాబు, వంతాల రమణ, వండ్లాబు దేముళ్లనాయుడు, మురళి, వలంటీర్లు సంఘం మండల అధ్యక్షుడు ఎం కూర్మన్‌రాజు పాల్గొన్నారు.

రేఖపల్లి బస్సు సర్వీస్ పునరుద్ధరించాలి



విజయవాడ ఆర్టీసీ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

వీఆర్‌పురం: కూనవరం, ఎటపాక, వీఆర్‌పురం మండలాల ప్రజలు విజయవాడ, గుంటూరు వెళ్లి రావటానికి అనేక ఇబ్బందులు పడుతున్నారని రేఖపల్లి బస్సు సర్వీస్‌ను పునరుద్ధరించాలని ఆయా మండలాల ప్రజలు కోరుతున్నారు. బస్సు సర్వీసు లేక రైతులు, విద్యార్థులు, వ్యాపారులు భద్రాచలం వెళ్లి ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఈ సమస్యను రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి దృష్టికి తీసుకెళ్లగా, విజయవాడ ఏపీఎస్ ఆర్టీసీ డీపీటీవో వారికి లేఖ రాశారన్నారు. ఈ మేరకు కూనవరం గ్రామస్తులు ఎం.వి.వి. రాజు విజయవాడ ఆర్టీసీ కార్యాలయంలో అందజేయగా, బస్సు సర్వీసును పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు.

ఉపాధి కూలీలకు అందని వేతనాలు

మస్తర్లు నమోదు చేయడం లేదని ఆవేదన



పూర్తి స్థాయిలో మస్తర్లు జనరేట్ చేయాలని కోరుతున్న ఉక్కుర్భ ఉపాధి కూలీలు

పెదబయలు: ఎండలో ఎంతో కష్టపడి పని చేసిన ప్రాప్తికి మస్తర్లు జనరేట్ చేయడం లేదని మండలంలోని వనభంగి పంచాయతీ ఉక్కుర్భ ఉపాధి కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో మూడు శ్రమ శక్తి సంఘాల్లో 120 మంది ఐదు వారాల పాటు ఉపాధి పనులు చేశారు. రెండు వారాలు మాత్రమే మస్తర్లు నమోదు చేసి, మూడు వారాల మస్తర్లు నమోదు చేయడం లేదని వాపోతున్నారు. ఎండల్లో ఎంతో కష్టపడి పని చేస్తే ఉపాధి సిబ్బంది తమ శ్రమను గుర్తించడం లేదన్నారు. ఈ విషయం ఫీల్డ్ అసిస్టెంట్‌ను ప్రశ్నిస్తే రెండు మస్తర్లు మాత్రమే జనరేట్ అయ్యాయని చెప్పినట్లు వేతనదారులు ఎస్. నీలకంఠం, డుంబేరి కోటేశ్వరరావు, సారె విజయ్, తదితరులు తెలిపారు. జనవరి నుంచి పని చేసిన ఉపాధి వేతనాలు అందలేదన్నారు. ఈ విషయంపై ఏపీవో అప్పలనాయుడిని వివరణ కోరగా, జనరేట్ కాని మస్తుర్లు తన దృష్టికి తీసుకుని వస్తే సంబంధిత టీఏకు చెప్పి చేయిస్తామన్నారు. జనవరి నుంచి ఉపాధి వేతనాలు రాష్ట్ర వ్యాప్తంగా నిలిచిపోయాయని తెలిపారు.